


ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 20-04-2026 | సంపుటి - 27 | సంచిక -328 | రూ : 4 | పేజీలు: 8


## హైదరాబాద్ పోలీసుల
# 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'

- దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్ అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
- 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు
- మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ
- ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 19 : దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వారం

తరువాయి 2లో





# ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై సీఎం రేవంత్‌రెడ్డి
- లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ సందర్భంగా విజ్ఞప్తి

హైదరాబాద్ : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రి అజహరుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి... రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం అసెంబ్లీ, మండలి.. ఏ సభలోనూ అజహరుద్దీన్ సభ్యుడిగా లేరు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వెంటనే ఆమోదించాలని సీఎం... గవర్నర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆయన మంత్రి పదవిని చేపట్టి ఈ నెలాఖరుకు ఆర్నెల్లు పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఏదో ఒక

తరువాయి 2లో



## మహిళా బిల్లుపై కేంద్రం
# తదుపరి అడుగులు ఇవే!

- అన్ని పార్టీలతో మరోసారి చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధించాలని యోచన
- జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్ల అమలు
- బిల్లును మళ్లీ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

2లో





# రెండో విడత చర్చలకు సిద్ధం


- వెల్లడించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్చలకు ఇరాన్ తిరస్కరణ
- పాకిస్తాన్‌కు వెళ్లనున్న యూఎస్ ప్రతినిధులు
- అమెరికాకు ఇజ్రాయిల్ గొప్ప మిత్రదేశం : ట్రంప్
- చాలా దూరంలో తుది ఒప్పందం : ఇరాన్
- బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసేస్తాం : హౌతీలు

2లో

## చెన్నై సూపర్ 6
# స్టాలిన్ హామీల జల్లు

- చెన్నై జిల్లాకు 'సూపర్ 6' పేరుతో ప్రత్యేక మేనిఫెస్టో
- ఆరు కీలక రంగాల్లో 20 ప్రధాన ప్రకటనలు
- 1000 కొత్త మినీ బస్సులు, ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు కచ్చితమైన గడువులు
- రూ.10,000 కోట్లతో గ్లోబల్ సెంటర్, 20,000 ఉద్యోగాల కల్పన

2లో



# మండుటెండల్లో.. వానలు

- గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- హైదరాబాద్ నగరానికి రాత్రి 7 గంటల వరకు వర్ష సూచన
- మేడ్చల్, రంగారెడ్డి సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ


2లో



## చంద్రబాబు బర్త్‌డే
# భువనేశ్వరి రూ.76 లక్షల విరాళం

- ఏప్రిల్ 20న పుట్టినరోజు జరుపుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం
- ఈ ఏడాది మీ పుట్టినరోజు బహుమానం ఇదే" అంటూ చంద్రబాబుకు భువనేశ్వరి విషెస్
- అర్థాంగిని అభినందించిన సీఎం చంద్రబాబు

2లో



# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'..

హైదరాబాద్, ఏప్రిల్ 19 : దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు.ఇండస్ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్ 1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

## చంద్రబాబు బర్త్‌డే
# భువనేశ్వరి రూ.76 లక్షల విరాళం

అమరావతి, ఏప్రిల్ 19: రాష్ట్రంలో పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు, అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి అన్నారు. రేపు (ఏప్రిల్ 20) ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమె అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళంతో రేపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం అందించనున్నారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అన్న క్యాంటీన్ సీఈవోకు ఆమె చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కేవలం రూ.5 లకే అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, గౌరవంగా భోజనం అందించడం అభినందనీయమని కొనియాడారు. రోజువారీ కూలీలు, నిరుపేదలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని, ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చంద్రబాబు పుట్టినరోజున పేదల కడుపు నింపే కార్యక్రమానికి విరాళం ఇవ్వడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా మించిన సంతృప్తి మరొకటి ఉండదని, తాను పలు సందర్భాల్లో అన్న వితరణలో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతిని గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కూడా 12 ఏళ్లుగా ఏటా తిరుమల అన్నప్రసాదానికి రూ.44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. "ఈ ఏడాది మీ పుట్టినరోజుకు మేమిచ్చే బహుమానం ఇదే" అంటూ ఆమె చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు, తన పేరు మీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి భారీ విరాళం ఇచ్చిన అర్ధాంగి భువనేశ్వరిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఒక గొప్ప యజ్ఞంలా ముందుకు తీసుకెళుతున్నాం. తిరుమలలో భక్తుల సహకారంతో నాలుగు దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోంది. అదే స్ఫూర్తితో అన్న క్యాంటీన్ల సేవలను మరింత విస్తరించాలి" అని అన్నారు. నాణ్యతను పాటిస్తూ, పవిత్రంగా, గౌరవంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలని, తద్వారా ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిదాయక బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు.

# మహిళా బిల్లుపై కేంద్రం తదుపరి అడుగులు ఇవే!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాతే రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పడంపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో, ఈ అడ్డంకులను అధిగమించేందుకు కేంద్రం కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ బిల్లు అమలుకు సంబంధించి ఏకాభిప్రాయం సాధించేందుకు, త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో మరోసారి విస్తృత స్థాయి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, అందరినీ కలుపుకొని పోవాలని యోచిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియపై నెలకొన్న గందరగోళాన్ని నివారించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. అయితే, జనాభా లెక్కల సేకరణ పూర్తయితేనే డీలిమిటేషన్ చేపట్టడం సాధ్యమవుతుంది. అందుకే, ముందుగా సెన్సస్ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాతే రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా మహిళా ఓటర్ల మద్దతును కూడగట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మరోవైపు, డీలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అవసరమైన సాంకేతిక మార్పులతో బిల్లును తిరిగి పార్లమెంటులో ప్రవేశపెట్టే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# చెన్నై సూపర్ 6 స్టాలిన్ హామీల జల్లు

చెన్నై, ఏప్రిల్ 19 : తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, చెన్నై జిల్లాను లక్ష్యంగా చేసుకుని 'చెన్నై సూపర్ 6' పేరుతో ఒక ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. నగర మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ సౌకర్యాలు, భవిష్యత్ ఆర్థిక వృద్ధి వంటి ఆరు కీలక రంగాల్లో మొత్తం 20 హామీలను ఇందులో పొందుపరిచారు. పట్టణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా, చివరి మైలు కనెక్టివిటీ కోసం 1,000 కొత్త మినీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు డీఎంకే హామీ ఇచ్చింది. ఈ బస్సులు వీధులను బస్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, రైల్వే హబ్‌లతో కలుపుతాయి. దీనికి తోడు, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని 25 శాతం వరకు తగ్గించేందుకు ఏఐ (ఏఐ) ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను తీసుకొస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు చెన్నై పెరిఫెరల్ రోడ్ ప్రాజెక్టుతో సహా పదికి పైగా ప్రధాన పథకాలను 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను 2028 నాటికి, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, రూ.10,000 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఏఐ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి రంగాలపై దృష్టి సారించే ఈ కేంద్రం ద్వారా 20,000 అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, వీధికుక్కల సమస్యకు శాస్త్రీయ పరిష్కారంగా, యానిమల్ బెర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తామని, వెటర్నరీ వైద్యులు, డాగ్ క్యాచర్ల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. వీటితో పాటు, మెట్రో వాటర్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, అన్ని నివాస ప్రాంతాల్లో హైఇంటెన్సిటీ వీధి దీపాలు వంటి హామీలను కూడా ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

# మండుటెండల్లో... వానలు

హైదరాబాద్ : ఓవైపు భానుడు భగభగ మండిపోతున్నాడు.. మరోపక్క రాష్ట్రంలో పలుప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి. దీంతో రాష్ట్రంలో ఒకేసారి భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్టు అయింది. వాతావరణ శాఖ సమాచారం మేరకు ఆదివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 43.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉష్ణోగ్ర తల్లో పెద్దగా మార్పులేమీ ఉండబోవని వాతావరణ శాఖ ప్రకటిం చింది. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు పలు జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయనీ, ఒకటెండ్రు చోట్ల వడగండ్లు కూడా పడొచ్చని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. ఆ జాబితాలో కొమ్రంభీమ్ అసిఫాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కా జిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, నిర్మాల్, నిజామాబాద్, మంచి ర్యాల, మెదక్, కామారెడ్డి ఉన్నాయి. ఆదివారం రాత్రి 9:30 గంటల వరకు రాష్ట్రంలో 98 ప్రాంతాల్లో వర్షం పడింది. అందులో జీహెచ్ఎంసీ పరిధిలోనే 33 చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదైంది. అక్కడక్కడ వడగండ్ల వానతో జనం సేదదీరారు.

# ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

హైదరాబాద్ : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రి అజహరుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి... రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం అసెంబ్లీ, మండలి.. ఏ సభలోనూ అజహరుద్దీన్ సభ్యుడిగా లేరు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వెంటనే ఆమోదించాలని సీఎం... గవర్నర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆయన మంత్రి పదవిని చేపట్టి ఈ నెలాఖరుకు ఆర్నెల్లు పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నుకోబడాలి లేదంటే నియమించబడాలి. కానీ అజహరుద్దీన్ విషయంలో ఈ రెండూ జరగలేదు. అందువల్లే సీఎం అత్యవసరంగా గవర్నర్‌తో భేటీ అయినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కూడా ఇదే విషయాన్ని గవర్నర్ వద్ద ప్రస్తావించారు. ఒకవేళ సీఎం చేసిన విజ్ఞప్తిని గవర్నర్ తోసిపుచ్చితే ఈనెల 30 తర్వాత అజహరుద్దీన్ తన మంత్రి పదవిని వదులుకోవాల్సి ఉంటుంది. శుక్లాతో భేటీ సందర్భంగా విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించినట్టు సీఎంవో పేర్కొంది. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులతో ప్రమాణం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లోక్ భవన్ ఆధ్వర్యంలో జూన్ 12న ఎల్బీ స్టేడియంలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామనే విధంగా విద్యార్థుల నుంచి ప్రమాణపత్రం తీసుకోవాలని గవర్నర్ కోరారు. ఆయన చేసిన సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# రెండో విడత చర్చలకు సిద్ధం

న్యూయార్క్ / టెహ్రాన్ : పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిపే చర్చల కోసం అమెరికా ప్రతినిధులు సోమవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారని ట్రంప్ ప్రకటించారు. ఆదివారం సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్‌లో.. ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధులతో జరగనున్న రెండో విడత ముఖాముఖి చర్చలకు అమెరికా ఏ అధికారులను పంపుతుందో ట్రంప్ వివరంగా చెప్పలేదు. గత వారాంతంలో జరిగిన చర్చలలో అమెరికా ప్రతినిధి బృందానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వం వహించారు. కానీ ఆ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. బుధవారం ముగియనున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని, శనివారం హార్ముజ్ జలసంధిలో కాల్పులు జరపడం ద్వారా ఇరాన్ ఉల్లంఘించిందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా అందిస్తున్న ఒప్పందంలోని నిబంధనలను అంగీకరించకపోతే ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. "మేం చాలా సరసమైన, సహేతుకమైన ఒప్పందాన్ని అందిస్తు న్నాం. వారు దానిని అంగీకరిస్తారని నేను ఆశిస్తున్నాను. ఎందుకంటే, వారు అంగీకరించకపోతే, యూఎస్..ఇరాన్‌లోని ప్రతి ఒక్క విద్యుత్ ప్లాంటును, ప్రతి ఒక్క వంతెననూ నాశనం చేయబోతోంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో రాశారు.

### చర్చలకు ఇరాన్ నో

అయితే తాజా చర్చల గురించి ట్రంప్ చేసిన వాదనపై టెహ్రాన్ నుంచి తక్షణ స్పందన ఏదీ రాలేదు. అనంతరం ఇరాన్ ఓడరేవులపై నౌకాదళ దిగ్బంధనం కొనసాగుతున్నంత కాలం, పాకిస్తాన్‌కు సంప్రదిం పుల ప్రతినిధి బృందాన్ని పంపేందుకు ఇరాన్ తిరస్కరించినట్టు ఇరాన్ న్యూస్ ఏజెన్సీ ఐఆర్ఎన్ఏ ట్వీట్ చేసింది.

### దిగ్బంధనం చట్టవిరుద్ధం

అమెరికా నౌకాదళ దిగ్బంధనం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమే కాకుండా, అది ఒక "చట్టవిరుద్ధమైన, నేరపూరితమైన" చర్య అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. "ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతంపై అమెరికా విధించిన 'దిగ్బంధనం' పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిం చడమే కాకుండా, చట్టవిరుద్ధం, నేరపూరితం కూడా" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఎక్స్ పోస్ట్‌లో రాశారు. అంతేకాకుండా, ఇరాన్ ప్రజలపై ఉద్దేశపూర్వకంగా సామూహిక శిక్ష విధించడం యుద్ధ నేరం , మానవత్వానికి వ్యతిరేకమైన నేరం కిందకు వస్తుందని బఘాయి జోడించారు. హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిచిన 24 గంటలలోపే మళ్లీ మూసివేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) నౌకాదళం శనివారం తెలిపింది. ఇరాన్ నౌకలు, ఓడరేవులపై అమెరికా తన నౌకా దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు ఇది ఇలాగే కొనసాగుతుందని స్పష్టం చేసింది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ ఇషాక్ దార్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ఆదివారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ప్రస్తుత సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి, నిరంతర సంభాషణలు, పరస్పర సంప్రదింపులు అత్యవసరమని తాము చర్చించినట్టు పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

### * ఇరాన్‌ను లొంగదీసుకొనేందుకు అమెరికా వ్యూహం

హార్ముజ్ జలసంధి వద్ద కొరకరాని కొయ్యగా మారిన ఇరాన్‌ను లొంగదీసుకొనేందుకు అమెరికా మరో వ్యూహాన్ని తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇరాన్‌కు సంబంధించిన వాణిజ్య నౌకలు, చమురు ట్యాంకర్లు ఎక్కడున్నా సీజ్ చేయాలనే వ్యూహంపై కసరత్తు చేస్తోంది. ఇరాన్ పోర్టులను దిగ్బంధించిన అమెరికా.. దాని జలరవాణా వ్యవస్థను కూడా దెబ్బతీయాలని భావిస్తోంది. ఇరాన్‌కు అవసరమైన మెటీరియల్ సరఫరా చేసే నౌకలు.. ఇరాన్ చమురును తరలించే ట్యాంకర్లు అమెరికా రాడార్లలోకి రానున్నాయి. దీంతో ఉద్రిక్తతలు పశ్చిమాసియాను దాటి ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకు కూడా వ్యాపించే అవకాశం ఉంది. ఇరాన్ నౌకలు నిన్న కాల్పులు జరిపిన నేపథ్యంలో ఈ ప్రతిపాదనలు బయటకు రావడం గమనార్హం. పశ్చిమాసియాకు దూరంగా ఉన్న ఇరాన్ వాణిజ్య నౌకలపై దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకోవడానికి పెంటగాన్ సిద్ధమవుతోందని అమెరికా మీడియాలో కథనాలు పేర్కొంటున్నాయి. ఈ వ్యూహం ఇరాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి సృష్టిస్తుందని అమెరికా అంచనా వేస్తోంది.

హార్ముజ్‌లో ఇప్పటివరకు అమెరికా 23 నౌకలను అడ్డుకుంది. వీటిల్లో ఆయుధాలు లేదా చమురు ఉండే అవకాశం ఉందని అనుమానిస్తోంది. ప్రస్తుతం ఇరాన్ రోజుకు 16లక్షల బ్యారెల్ల చమురును విక్రయిస్తోంది. వీటిల్లో అత్యధికంగా చిన్న రిఫైనరీల ద్వారానే జరుగుతోంది. ఈ క్రమంలో ఇరాన్ నౌకలు, కంపెనీలు, వ్యక్తులపై కొత్త ఆంక్షలను కూడా అమల్లోకి తీసుకొచ్చారు.

### * అమెరికాకు గొప్ప మిత్రదేశం ఇజ్రాయిల్‌పై ట్రంప్ ప్రశంసలు

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్‌పై ప్రశంసలు కురిపించారు. దాని ధైర్యసాహసాలను, విధేయతను మెచ్చుకున్నారు. ఈ మేరకు ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఆదివారం ఓ పోస్ట్ పెట్టారు. ప్రజాభిప్రాయం ఎలా ఉన్నప్పటికీ అమెరికా వైపే ఇజ్రాయిల్ గట్టిగా నిలబడిందని చెప్పారు. 'ప్రజలు ఇజ్రాయిల్‌ను ఇష్టపడినా లేకున్నా ఆ దేశం అమెరికాకు గొప్ప భాగస్వామిగా, మిత్రదేశంగా నిలిచింది. వారు ధైర్యవంతులు. సాహసికులు. తెలివైన వారు. ఘర్షణ, ఒత్తిడి సమయంలో ఇతరుల మాదిరిగా కాకుండా వారు తమ వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. ఇజ్రాయిల్ గట్టిగా పోరాడుతోంది. ఎలా గెలవాలో దానికి తెలుసు' అని ట్రంప్ తెలిపారు. అదే సమయంలో ఆయన తన నాటో భాగస్వాములపై విమర్శలు సంధించారు. ఇరాన్ యుద్ధాన్ని విమర్శించి, హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను సమర్థించడానికి నిరాకరించడం ద్వారా అవి తమ నిజస్వరూపాన్ని చాటుకున్నాయని మండిపడ్డారు.

### ట్రంప్ పోస్టుపై వివరణ కోరిన ఇజ్రాయిల్

ఇదిలావుండగా లెబనాన్‌పై వైమానిక దాడులు జరప కుండా ఇజ్రాయిల్‌ను 'కట్టడి చేశామ'ంటూ ట్రంప్ పెట్టిన పోస్టుపై ఇజ్రాయిల్ వివరణ కోరింది. ట్రంప్ పోస్టు నెతన్యాహూను, ఆయన సలహాదారులను దిగ్భ్రాంతి పరచింది. ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ట్రంప్ పోస్టు విరుద్ధంగా ఉండడమే దీనికి కారణం.

### * తుది ఒప్పందం చాలా దూరంలో ఉంది : ఇరాన్

టెహ్రాన్ : అమెరికాతో యుద్ధానికి ముగింపు పలికేందుకు జరిపిన చర్చల్లో కొంత పురోగతి కన్పించినప్పటికీ తుది ఒప్పందం ఇంకా చాలా దూరంలో ఉన్నదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబఫ్ వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో బఘేర్ వ్యాఖ్య ప్రాధాన్యత సంతరించుకుంది. తాము కొన్ని అంశాలపై పట్టుబట్టామని, అమెరికా కూడా అంతేనని చెప్పారు. 'మా మధ్య అనేక అంతరాలు ఉన్నాయి. కొన్ని మౌలిక అంశాలు అలాగే ఉండిపోయాయి' అని అన్నారు.

## ప్రైవేట్ స్కూల్ టీచర్ కు
# ఆర్థిక సహాయం




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే శస్త్ర చికిత్స పొంది ఇంట్లోనే ఉంటున్న ప్రైవేటు స్కూలు ఉపాధ్యాయురాలు లతకు మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆదివారం పదకొండు వేల ఐదు వందల రూపాయల ఆర్థికసాయాన్ని అందచేసింది.జిల్లా కేంద్రంలోని మహర్షి స్కూల్లో హిందీ టీచరుగా విధులు నిర్వహిస్తున్న లత అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకోవడం జరిగినది.లత కుటుంబ పరిస్థితిని అర్థము చేసుకున్న తోటి ఉపాధ్యాయ బృందము, మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ కలిసి అసోసియేషన్ సభ్యుల చేయూతతో,వారి ఇంటికి వెళ్లి ,పరామర్శించి ఆర్థిక సహాయం అందించి ఆత్మస్థైర్యాన్ని కలిగించి త్వరగా కోలుకొని తిరిగి సాధారణ జీవనాన్ని కొనసాగించాలని ఆకాంక్షించినారు.అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గందు మురళి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులకు , అసోసియేషన్ అన్ని వేళల సహాయకారిగా ఉంటుందని ప్రైవేటు టీచర్స్ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుటకు నిరంతరము శ్రమిస్తుందని అన్నారు.చేయూత అందించిన అసోసియేషన్ సభ్యులకు,డి.ఆర్. కాలేజ్ , హైద్రాబాద్ యాజమాన్యం కు కృతజ్ఞతలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ చేపూరి రవి,ఉపాధ్యక్షులు బి. ప్రవీణ్,కోశాధికారి ఎం.రాంబాబు,జాయింట్ సెక్రెటరీ ఎం.డి. సలీం , సోషల్ మీడియా కన్వీనర్ ఎన్. మధుసూదన్ , డోలీ సుధాకర్ , అసోసియేషన్ సభ్యుడు రషీద్, మైనారిటీ స్కూల్ టీచర్ ఇమాముద్దీన్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# హిందువుల ఐక్యత చాటి చెప్పాలి

* శ్రీ శ్రీ శ్రీ శంకర స్వామిజీ
* భక్తిశ్రద్ధలతో శివ మారుతి బస్తీ 'హిందూ సమ్మేళనం'

ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్ : హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వ గురువుగా నిలపాలంటే మన హిందువుల ఐక్యత చాటి చెప్పాలని శ్రీ శ్రీ శ్రీ శంకర స్వామిజీ పిలుపునిచ్చారు. మన ఐక్యతే మన బలమని, ఆ బలమే మన జీవితమని, మనమందరం ఐక్యమత్యం గా లేకపోతే మన బలహీనతే మన మరణ శాసనంగా నిలుస్తుందని, నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరమని ఆయన ఉద్బోధించారు. హిందూ ధర్మం యొక్క విలువలు, సంప్రదాయాలు, గొప్పతనాన్ని నేటి తరానికి వివరించేలా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఏబీ కన్వెన్షన్ హాల్లో హిందూ సమ్మేళన కమిటీ అధ్యక్షులు బెజుగం రమేష్, కార్యదర్శి అయ్యవారి అంజనేయులు, కోశాధికారి సోమ శ్రీనివాస్ సమక్షంలో శివ మారుతి బస్తి హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శ్రీ శ్రీ శ్రీ శంకర స్వామీజీ, ముఖ్య వక్తగా సహప్రాంత ప్రచారక్ ప్రభు కుమార్, విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి ప్రాంత సహ సంయోజక మహిళ వక్త సాధి శ్రీవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు, పట్టణ ప్రముఖులు మొదటగా భరతమాత చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం రమేష్ చారి ఏకపాత్రాభినయంగా చేసిన బస్వాసుర నాటకం, అదేవిధంగా కళజ్యోతి సంస్కృతిక సంస్థ వారి చిన్నారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విశిష్ట అతిథి శ్రీ శ్రీ శ్రీ శంకర స్వామీజీ ప్రసంగిస్తూ సనాతన హిందూ ధర్మం కేవలం ఒక మతం కాదని, అది ఒక జీవన విధానం అని ఆయన వివరించారు. ప్రపంచానికి శాంతిని, సహనాన్ని నేర్పిన గొప్ప సంస్కృతి మనదని అన్నారు. నేటి ఆధునిక కాలంలో యువత పాశ్చాత్య సంస్కృతి వైపు మొగ్గు చూపుతూ మన మూలాలను మర్చిపోవడం విచారకరమన్నారు. ప్రతి హిందువు




తన ఇంట్లో పిల్లలకు రామాయణ, భారత గాథలను, ధర్మసూత్రాలను నేర్పించాలన్నారు. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుందని, కులం, ప్రాంతం, భాష వివాదాలను వీడి, హిందువులందరూ ఐక్యమత్యంతో ఉన్నప్పుడే సమాజం శక్తివంతంగా తయారవుతుందన్నారు. ప్రతి బస్తీలోనూ, ప్రతి ఇంట్లోనూ ధర్మ చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ముఖ్య వక్త ప్రభు కుమార్ మాట్లాడుతూ హిందూ శక్తిని సంఘటితం చేయాల్సిన ఆవశ్యకతను వివరించగా, సాధి శ్రీవాణి , మహిళలు ధర్మ పరిరక్షణలో పోషించాల్సిన పాత్రను ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ వాహిని సభ్యులు బందారి రమేష్, నాగిళ్ల ప్రభాకర్, కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, అనిత రఘునాథ్ యాదవ్, పేట అశోక్, న్యాయవాది కల్యాణదగిరి, రామ్మోహన్, వక్త హరీష్‌కుమార్, పట్టణ పుర ప్రముఖులు, భక్తులు, అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో
# ఉచిత ఆర్చరీ కోచింగ్ సమ్మర్ క్యాంప్

మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లాలోనీ విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీయడం,వారికి శారీరక దారుఢ్యం క్రమశిక్షణను పెంపొందించడం లక్ష్యంగా, ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తున్నామని , ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల సారంగపాణి, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డెవలప్మెంట్ మెంబర్ పుట్టా శంకరయ్య లు తెలిపారు. విల్లు, బాణాలను ఉపయోగించి లక్ష్యాన్ని ఛేదించే ప్రాచీనమైన, ప్రతిష్ఠాత్మక క్రీడ అయిన ఆర్చరీ (విలువిద్య)లో శిక్షణ పొందేందుకు, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్, వరంగల్ జిల్లా ఆర్చరీ అసోసియేషన్, సాదుల ముత్తయ్య



మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ క్యాంప్ నిర్వహించబడుతుంది. మహబూబాబాద్ (మానుకోట) ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఈ నెల 26న ఆదివారం ఉదయం 68, సాయంత్రం 4.306.30, నెల రోజుల పాటు ఉంటుందన్నారు. 10 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలురు, బాలికలు అర్హత ఉండాలన్నారు. 4వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ కోచింగ్ క్యాంప్ ద్వారా విద్యార్థులకు ఆర్చరీలో ప్రాథమిక నైపుణ్యాలతో పాటు, శారీరక దారుఢ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ ,పోటీ స్థాయి అవగాహనను పెంపొందించబడుతుంది. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించేందుకు ఇది ఒక బలమైన పునాది అవుతుంది మీ పిల్లలలో ఉన్న క్రీడా ఆసక్తిని గుర్తించి, వారిని ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించండి. ఆర్చరీ క్రీడలో భవిష్యత్తు ఉన్నత అవకాశాలను అందించగలదని గుర్తుంచుకోండి. ఈ వేసవి సెలవులను మీ చిన్నారి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9394643139, 9494543139 సంప్రదించాలన్నారు

## బాదంపల్లి గోదావరి తీరంలో మూడు గేదెలకు తీవ్ర గాయాలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం: వన్యప్రాణుల వేట కోసం అమర్చిన పంది గోలీలు కొరకడంతో మూడు గేదెలకు తీవ్ర గాయాలైన ఘటన జన్నారం మండలం బాదంపల్లి గోదావరి రేవు వద్ద చోటుచేసుకుంది.బాదంపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపర్లు దుమల్ల కేశన్న, దుమల్ల నారాయణ, గొట్ల లింగన్న ఆదివారం గ్రామానికి చెందిన రైతులకు సంబంధించిన గేదెలను మేత కోసం గోదావరి నది తీర ప్రాంతానికి తీసుకెళ్లారు.ఆ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం అమర్చిన పంది గోలీల వల్ల అదే గ్రామానికి చెందిన మల్లెపల్లి శంకరయ్య, గడిపెల్లి నర్సయ్య, సామల్ల రాజన్నలకు చెందిన మూడు గేదెలు వాటిని ఆహారంగా భావించి పొరపాటున నోట కొరకడంతో అవి పేలిపోయాయి.దీంతో ఆ మూడు గేదెల మూతి, ముఖ భాగం నుజ్జునుజ్జు అయి తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశువుల కాపర్లు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు.గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్ఐ గుర్రం ఉదయ్ కిరణ్ మధ్యాహ్నం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గాయలపాలైన పశువులను చికిత్స నిమిత్తం పశు వైద్యశాలకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా విజయ గణపతి దేవాలయ ప్రారంభోత్సవం



జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానంద నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న విజయ గణపతి దేవాలయ ప్రారంభోత్సవ పూజ కార్యక్రమంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమ విజయ గణపతి స్వామి దయతో చేపట్టే ప్రతీ కార్యంలో విజయం చేకూరాలన్నారు. స్వామి వారి కరుణా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్. దాస్ గౌడ్, కె. బుచ్చి రెడ్డి, బి. ఆర్. విశాల్, ఆర్. అనిల్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ జీడిమెట్ల డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకం

* బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజుల రామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్ బి కి చెందిన "యువ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్"సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంక్షేమ ససంఘం "యువ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్" సభ్యులకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.ఈ



కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి. నాగ భూషణ చారి, ఉపాధ్యక్షులు వెంకటేష్ గౌడ్, వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి ఆనంద్, సలహాదారులు అశోక్, మల్లికార్జున్, రఘుపతి రాములు, సభ్యులు గణేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, పులి రాజు, సిద్ధు గౌడ్, రాజేందర్, జె. మల్లేష్, శ్రీనివాస్, దత్తు, సంతోష్‌గుప్తా, రాజు పంతులు, కేశవులు, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాలలు ఏకం కావాలి



ప్రజాస్ఫూర్తి, జన్నారం: మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న మాల సభ్యులందరూ ఒకతాటిపైకి వచ్చి తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలని జన్నారం మండల మాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జన్నారం పట్టణంలో వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ...చిన్నా, పెద్దా సమస్య ఏదొచ్చినా ఇతరులపై ఆధారపడకుండా మాల సంఘం ద్వారానే పరిష్కరించుకునేలా అందరూ కలిసికట్టుగా ఉండాలని వారు కోరారు. ప్రభుత్వం మాలల పట్ల చిన్నచూపు చూస్తోందని, అందువల్ల ఇతర సంఘాల మాదిరిగా ఐకమత్యంగా ఉండి హక్కుల సాధన కోసం ఏ ఉద్యమానికైనా సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో బొట్ల సంజీవ్, అక్కవత్తుల దేవయ్య, పిట్ట రాజారావు, గద్దల పవన్ కుమార్, నల్ల తిరుపతి, మేకల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని
# తీర్చడం అత్యుత్తమ సేవ


* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



జగద్గిరిగుట్ట , ప్రజాస్ఫూర్తి : ప్రజల దాహార్తిని తీర్చడం అత్యుత్తమ సేవ అని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం చింతల్ బస్ స్టాండ్ వద్ద బిఆర్ఎస్ నాయకులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రజలకు సేవ చేయాలని ఆలోచన ఉన్న ప్రతీ ఒక్కరికీ ఈ కార్యక్రమం మరింత స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషోర్ చారి, వనం శ్రీనివాస్, ఎండి. నజీరుద్దీన్, రమణా రెడ్డి, ఆంజనేయులు, నగేష్, జయం చారి, డీజే రమేష్, వివిధ డివిజన్లకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 315 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు..

శేరిలింగంపల్లి: సైబరాబాద్‌లో వీకెండ్-స్పెషల్ డ్రంక్ & డ్రైవ్ తనిఖీలలో 315 మంది మందుబాబులుపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 315 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 268 ద్విచక్ర వాహనదారులు, 15 ఆటోలు, 28 కార్లు, 04 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే.. 277 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 27 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 11 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్



సేవించి పట్టుబడ్డారు.

# మహిళా రిజర్వేషన్‌ను 2024లో ఎందుకు అమలు చేయలేదు: కడియం కావ్య

హనుమకొండ కలెక్టరేట్: మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని 2023లోనే అన్ని పార్టీల సమ్మతితో బిల్లు ఆమోదం పొందిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ అనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ 2023 లోనే అన్ని రాజకీయ పార్టీల అనుమతితో మహిళా బిల్లు ఆమోదం పొందితే ఆనాడే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన బీజేపీ ప్రభుత్వం 'జనగణన' 'డిలిమిటేషన్' పేర్లతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముసుగుగా పెట్టుకుని, డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా రాజకీయ లాభాలు పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.దక్షిణాది రాష్ట్రాలపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రస్తావిస్తూ, కుటుంబ నియంత్రణ పాటించి అభివృద్ధికి తోడ్పడిన సౌత్ రాష్ట్రాలను శిక్షించేలా డిలిమిటేషన్ చేయడం సరికాదన్నారు.

* ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే శక్తులు ముందుకు రావాలి



దేశ జీడీపీలో గణనీయమైన వాటా ఇస్తున్న దక్షిణాదిని కేంద్రం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రాజకీయ శక్తులు బీజేపీకి లొంగిపోతూ దక్షిణాది ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.ఈ నేపథ్యంలో పార్టీలు అతీతంగా అన్ని దక్షిణాది రాష్ట్రాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే శక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "డిలిమిటేషన్ పేరిట జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలి. రాజ్యాంగాన్ని, సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకోవాలి" అని కడియం కావ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రమంగా కోలుకుంటున్నాను.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు

- హైదరాబాద్‌లో శనివారం నాడు సర్జరీ చేయించుకున్న పవన్ కల్యాణ్
- తన ఆరోగ్యం నిలకడగా ఉందని, క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడి
- సందేశాలు పంపిన రాజకీయ, సినీ ప్రముఖులకు పేరుపేరునా కృతజ్ఞతలు
- అన్నయ్య చిరంజీవి, నాగబాబు పోస్టులకు భావోద్వేగంగా స్పందించిన పవన్

హైదరాబాద్, ఏప్రిల్ 19: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాను క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడించారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం నాడు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. సర్జరీ విజయవంతమైన నేపథ్యంలో తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతో పాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ, తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారు. వైద్యుల సూచన మేరకు, సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని చిరంజీవి పేర్కొన్నారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను" అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దాం" అని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి పవన్ స్పందిస్తూ, "నా ఆరోగ్యం, కోలుకోవడం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ. నేను క్రమంగా



కోలుకుంటున్నాను. మీ ఆదరణకు కృతజ్ఞుడను" అని బదులిచ్చారు. వీరితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలంటూ తమ సందేశాల్లో పేర్కొన్నారు. సినీ పరిశ్రమ నుంచి జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్ వంటి ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అందరి ప్రేమ, ఆప్యాయతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తి విశ్రాంతి అనంతరం త్వరలోనే విధుల్లో చేరతారని జనసేన వర్గాలు తెలిపాయి.

# ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రిసెప్షన్‌కు సీఎం రేవంత్.. నూతన దంపతులకు ఆశీస్సులు

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వివాహ రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- నూతన దంపతులు వెంకట్, ఇందుజలను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి
- ఇటీవల గోవాలో వెంకట్ వివాహం జరిగిన సంగతి తెలిసిందే
- పార్టీ నాయకులు, శ్రేయోభిలాషుల కోసం ఈ విందు ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 19: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ యువ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న గడ్డం ఇందుజ రెడ్డితో ఆయన వివాహం ఏప్రిల్ 11న గోవాలో జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోసం తాజాగా వివాహ రిసెప్షన్‌ను



ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై, నూతన దంపతులు వెంకట్, ఇందుజలతో కాసేపు ముచ్చటించారు. వారి భవిష్యత్ జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. ఈ విందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు కూడా హాజరై వధూవరులను అభినందించారు.



## డ్రోన్ తగిలి.. ఎమ్మెల్యేకు స్వల్ప గాయాలు

పరిగి: వ్యవసాయ డ్రోన్‌ను ప్రారంభించే క్రమంలో ప్రమాదవశాత్తు ఎమ్మెల్యేతోపాటు సర్పంచి గాయపడ్డారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో చోటు చేసుకుంది. కుల్కచర్ల మండల కేంద్రంలో ఆదివారం సహకార సంఘం ఆధ్వర్యంలో అగ్రి డ్రోన్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి డ్రోన్ ఎగురవేస్తున్న సమయంలో పైకి ఎగిరినట్లే ఎగిరి తిరిగి కాళ్లవైపు దూసుకువచ్చింది. దీంతో ఆయన ఎడమ కాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఆయన పక్కనే ఉన్న రాంపూర్ సర్పంచి తిరుపతయ్య చేతికి గాయాలయ్యాయి. పరిగి ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరికి ప్రథమ చికిత్స అందించారు. తిరుపతయ్య వేలికి కుట్లు వేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. అయితే ఎమ్మెల్యేకు ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

## అబద్ధాల పునాదులపైనే రేవంత్ సీఎం అయ్యారు: బండి సంజయ్

హైదరాబాద్: అబద్ధాల పునాదులపైనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆ అబద్ధాలతోనే మహిళా లోకాన్ని మోసం చేశారని విమర్శించారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. తులం బంగారం, స్కూటీ ఇస్తానంటూ నిలువునా ముంచారని ఆక్షేపించారు. మహిళా బిల్లును అడ్డుకొని దక్షిణాదికి ద్రోహం చేశారని, కేసీఆర్ తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా అబద్ధాలు, మోసాలతోనే పాలన చేస్తున్నారని మండిపడ్డారు.



## మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు

**: ఎంపీ చామల**

హైదరాబాద్: ఇండియా కూటమిపై భాజపా దుష్ప్రచారం చేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని.. డీలిమిటేషన్‌కు వ్యతిరేకమని స్పష్టం చేశారు. భాజపా దుష్ప్రచారాన్ని



మహిళలు పట్టించుకోవద్దని కోరారు. ''మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. మహిళా రిజర్వేషన్ల బిల్లు 2023లోనే ఆమోదం పొందింది. తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి కోసమే మళ్లీ బిల్లు తెచ్చారు. 2023లో బిల్లు ఆమోదం పొందినా.. 2024లో రిజర్వేషన్లు అమలు చేయలేదు'' అని చామల పేర్కొన్నారు.

## ప్రయాణికుల భద్రత
# ప్రభుత్వ బాధ్యత : సుప్రీంకోర్టు

దేశంలో పెరిగిపోతున్న రహదారి ప్రమాదాల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వెలువరించింది. రాజస్థాన్‌లోని ఫలోడీ, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదాలను సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం విచారణ జరిపింది. రహదారులపై అక్రమ పార్కింగ్‌లు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కును ఇచ్చిందని గుర్తుచేసింది. ఈ అధికరణంలోనే ప్రతి ప్రయాణికుడికి ప్రమాదరహితంగా వెళ్లే హక్కు అంతర్గతంగా ఉందని తెలిపింది. ప్రయాణికుల భద్రతను ప్రభుత్వ బాధ్యతగా చూడాలని తెలిపింది.



**మార్గదర్శకాల్లో కొన్ని..**

* అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానంలో భాగంగా ఎప్పటికప్పుడు రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు ఏర్పాట్లు
* రైట్ ఆఫ్ వేలో (రహదారి+మార్జిన్) లలో నూతన దాబా, హోటల్, వాణిజ్య నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదు
* జాతీయ రహదారుల వెంబడి నిర్మించిన అక్రమ నిర్మాణాలను 60 రోజుల్లోగా తొలగించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
* జాతీయ రహదారులు వెళ్తున్న జిల్లాల్లో.. 15 రోజుల్లోగా జిల్లా రహదారుల భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి
* రాష్ట్ర పోలీసు, రవాణాశాఖకు చెందిన అధికారులు నిరంతరం రహదారులను పర్యవేక్షించాలి. వీరు వెళ్లే వాహనాలకు ట్రాకింగ్ పరికరాలను అమర్చాలి
* ప్రతి 75 కి.మీలకు వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలి. వీటిలో విశ్రాంతి గదులు, హోటల్స్.. తదితర సౌకర్యాలను కల్పించాలి
* ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాలి. అక్కడ రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులను ఉంచాలి
* రెండు నెలల అనంతరం అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలపై న్యాయస్థానం సమీక్ష నిర్వహించనుంది

## సైబర్ మోసాల భారీ నెట్‌వర్క్‌ను ఛేదించిన హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్2.0' పేరుతో 9 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించిన పోలీసులు పలువురు బ్యాంకు అధికారులు సహా 52 మంది నిందితులను అరెస్టు చేశారు. పెట్టుబడి స్కామ్‌లు, ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో అమయాకులను బెదిరించిన నేరగాళ్లు భారీగా సొమ్మును దోచుకున్నట్లు తేల్చారు. సైబర్ ముఠాకు అండగా నిలుస్తున్న బ్యాంకు అధికారులే లక్ష్యంగా ఆపరేషన్ కొనసాగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో 32 మంది బ్యాంకు అధికారులు, 15 మంది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మీడియేటర్లు ఉన్నారు. నేరగాళ్లతో కుమ్మక్కైన బ్యాంకు అధికారులు.. అక్రమంగా వారికి ఖాతాలు తెరిచి ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో 16 ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల సొమ్మును దారి మళ్లించేందుకు నేరగాళ్లు ఏకంగా 350 బ్యాంకు ఖాతాలను వినియోగించినట్లు గుర్తించారు. ఈ ఖాతాలకు దేశవ్యాప్తంగా నమోదైన సుమారు 850 సైబర్ కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు.



మొత్తం రూ.150 కోట్ల మేర మోసాలు జరిగినట్లు పోలీసులు నిర్ధరించారు.

## చల్లని కబురు.. హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

హైదరాబాద్: ఎండ వేడిమికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు సాంత్వన పరిచాడు. హైదరాబాద్‌లో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వాన పడుతోంది. చింతల్‌లోని పద్మానగర్‌లో ఈదురుగాలుల ధాటికి భారీ వృక్షం నేల కూలింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.



పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్టీయూ, నిజాంపేట్, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల ప్రాంతాల్లో వడగళ్ల వాన కురుస్తోంది. మరోవైపు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. న్యూ బోయిన్‌పల్లి, లోతుకుంట, తిరుమలగిరి, బొల్లారం తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది.

## అంతరిక్షంలో అస్సామీ నృత్యం.. వీడియో వైరల్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)లో అమెరికాకు చెందిన ఓ వ్యోమగామి.. అస్సామీ జానపద నృత్యం 'బిహు'ను ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తున్న ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అస్సామీ నూతన సంవత్సరానికి గుర్తుగా రాష్ట్రం 'రంగాలి బిహు' చేసుకుంటున్న వేళ ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికన్ వ్యోమగామి మైక్ ఫింక్ సతీమణి రెనితా సైకియా అస్సామీ మూలాలు కలిగిన మహిళ. ఫింక్ తన మెడలో అస్సాం సంస్కృతికి ప్రతీక అయిన 'గమోసా' (స్కార్ఫ్) ధరించి.. ఐఎస్ఎస్‌లో బిహు



నృత్యం చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. దీన్ని అస్సాం సీఎం హిమంత పోస్ట్ చేస్తూ.. ''అస్సామీ సంస్కృతిపై ప్రత్యేక ఆదరణ చూపిన వ్యోమగామి మైక్ ఫింక్‌కు ధన్యవాదాలు. 'బిహు బినందియా' సందర్భంగా ఈ నృత్యంపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించిన అనంతరం దీనికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది'' అని పేర్కొన్నారు. 2023 ఏప్రిల్‌లో గువాహటిలో దాదాపు 10 వేల మంది కళాకారులు కలిసి ప్రదర్శించిన బిహు నృత్య కార్యక్రమమే 'బిహు బినందియా'. దీనిని ప్రధాని మోదీ స్వయంగా వీక్షించారు. అయితే, మైక్ ఫింక్ డ్యాన్స్ వీడియో ఇప్పటిది కాదని తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో లేరు. ముఖ్యమంత్రి హిమంత ఈ వీడియోను పోస్ట్ చేయడంతో వార్తల్లో నిలిచింది.

## అసెంబ్లీ ఎన్నికలు..
# 11,000 సోషల్ మీడియా పోస్టులపై 'ఈసీ' చర్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19, ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుదోవ పట్టించే పోస్టులు, చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు 11 వేల సోషల్ మీడియా పోస్టులు, ఇతర కంటెంట్‌పై చర్యలు తీసుకున్నట్లు ఈసీ వెల్లడించింది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో ఇప్పటికే పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ నెల 23న తమిళనాడులో, ఈ నెల 23, 29న రెండు దశల్లో పశ్చిమ బెంగాల్‌లో ఓటింగ్ నిర్వహించనున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే లేదా ఏఐ ద్వారా సృష్టించిన, మార్పులు చేసిన చట్టవిరుద్ధమైన కంటెంట్ విషయంలో ఫిర్యాదు వచ్చిన మూడు గంటల్లోగా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే ఆదేశించింది. అదేవిధంగా ప్రచారం కోసం ఉపయోగించే కృత్రిమ మేధ కంటెంట్‌పై 'ఏఐ జనరేటెడ్' అని లేబుల్ ఉండేలా పార్టీలు, అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మార్చి 15న ఎన్నికల ప్రకటన




వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకు 11 వేలకుపైగా ఈ తరహా సోషల్ మీడియా పోస్టులు, యూఆర్ఎల్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. కంటెంట్ తొలగింపు, ఎఫ్ఐఆర్ నమోదు వంటివి చేపట్టినట్లు తెలిపింది. అదేవిధంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి మార్చి 15 నుంచి ఈ నెల 19 వరకు సీవిజిల్ యాప్ ద్వారా 3,23,099 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించింది. వీటిలో 3,10,393 ఫిర్యాదులను అవి అందిన 100 నిమిషాల్లోపే పరిష్కరించినట్లు పేర్కొంది.

## మహిళలను అడ్డుపెట్టుకొని రాజకీయ కుతంత్రాలు: మమతా బెనర్జీ

కోల్‌కతా : మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం దురదృష్టకరమని మమతా బెనర్జీ మండిపడ్డారు. స్త్రీలను అడ్డుపెట్టుకొని నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. అందువల్లే వారి కుతంత్రాలను ప్రతిపక్షాలు కలిసికట్టగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ప్రధాని మోదీ పతనం పార్లమెంట్‌లోనే మొదలయ్యిందని..అది బెంగాల్‌లోనూ కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టుపెట్టారు. మహిళా



రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టేందుకు భాజపా చేసిన విఫల యత్నం.. కేంద్రం అసలు రూపాన్ని బయటపెట్టిందని మమత పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎల్లప్పుడూ రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం కోసం పోరాడుతుందని.. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ రెండింటిలోనూ తమ పార్టీలోనే అత్యధిక నిష్పత్తిలో ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులు ఉన్నారన్నారు. అటువంటి తమ పార్టీ మహిళా రిజర్వేషన్‌ను ఎందుకు వ్యతిరేకిస్తుందని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం వల్లే తాము వ్యతిరేకించామని పేర్కొన్నారు.



హెయిర్ ఫాల్ అనేది చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య. ఆహారంలో లోపం, హార్మోనల్ మార్పులు, ఒత్తిడి, జీవనశైలి సమస్యలు, జెనెటిక్ కారకాలతో జుట్టు రాలిపోతుంటుంది. ఈ సమస్యను తగ్గించడానికి హోమియోపతిలో మంచి చికిత్సలు ఉన్నాయని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు.

# జుట్టు రాలుతోందా... ఇలా చేస్తే ప్రయోజనం

జుట్టు రాలు సమస్యకు అందించే చికిత్సలో హోమియోపతి వైద్య విధానం ఒక వరం అని రుజువు అయ్యింది. హోమియోపతి మందులు సహజంగా రసాయనాలు,స్టెరాయిడ్లు లేకుండా తయారు చేస్తారు. హోమియోపతి వైద్యంలో జుట్టు రాలడానికి గల మూల కారణాన్ని గుర్తించి అందుకు తగిన పరిష్కారాన్ని అందిస్తారు. జుట్టు రాలడానికి గల కారణాన్ని బట్టి హెయిర్ కేర్ తీసుకుంటారు.

ఇప్పటికే ఉన్న లక్షణాలపై దృష్టి పెట్టడమే కాకుండా, రోగులకు సంబంధించిన పలు అంశాలను బట్టి జుట్టు రాలిపోవడానికి కారణాలు, వైద్య చరిత్రను విశ్లేషించి, మానసిక,శారీరక స్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యులు హోమియోపతి మందులను సూచిస్తారు.

ఈ మందులు జుట్టు మూలాలకు పోషణను అందిస్తాయి. అప్పుడు సమస్యకు సరైన పరిష్కారం అంది జుట్టు పెరుగుతుంది. హెయిర్ ఫాల్ అనేది కొందరిలో వయస్సు పరిమితి లేదు. కాగా హోమోయోపతిలో చాలా వరకు జుట్టు రాలడం సమస్యలు తగ్గినట్లు చాలా మంది చెబుతున్నారు. ముఖ్యంగా వారు చెప్పే సూచనలను పాటించడం చేస్తే జుట్టు రాలడం తగ్గి చాలా వరకు ఊడిపోకుండా ఉంటుంది.




# మధుమేహం అదుపులో ఉంచాలంటే రెండు చిట్కాలు

మధుమేహం అదుపులో ఉండాలంటే జీవనశైలిలో మార్పులు తప్పనిసరిగా అవసరం. సరిగ్గా నియంత్రిస్తే దీనికి సంబంధించిన సమస్యల నుంచి సులువుగా బయట పడొచ్చు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి మార్పులు చేసుకుంటే ఈజీగా రో ప
వ్యాధిగ్రస్తులందరూ రాత్రిపూట పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలున్నాయి. మీ బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంచేలా కొన్ని పనులు చేయాలి.

### శారీరక శ్రమ..


రాత్రి భోజనం చేసిన తర్వాత మంచం మీద పడుకోవడం మీ అలవాట్లలో ఒకటి అయితే, ఇది మీ ఉదయం పూట రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది. కాబట్టి తిన్న తర్వాత కనీసం అరగంట లేదా ఒక గంట పాటు ఏదైనా శారీరక శ్రమ చేయడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఒక అరగంట పాటు నడిస్తే ఆరోగ్యానికి చాలా మంచిది.


### యోగా..

యోగా ప్రతి ఒక్కరికీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిక్ సమస్య ఉన్నవారు యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. రాత్రి భోజనం చేసిన తర్వాత కొంత సమయం పాటు వజ్రాసనం వంటి యోగాసనాలను అలవాటు చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించడం సాధ్యమవుతుంది.

# ఏ వయసులో ఎన్ని గంటలు నిద్ర అవసరం?

శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక వ్యక్తికి తగినంత నిద్ర అవసరం. మంచి నిద్ర మిమ్మల్ని రోజంతా శక్తివంతంగా ఉంచడమే కాకుండా మిమ్మల్ని మీ మూడ్ ని బాగు చేస్తుంది. మీరు మంచి అనుభూతి చెందుతూ.. నిద్రలో శరీరంలో ఉత్పత్తి అయ్యే కొన్ని హార్మోన్లు కణాలను సరిచేయడం ద్వారా శరీరం శక్తి వినియోగాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి.






సీడీఓ ప్రకారం.. రాత్రికి ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయే వ్యక్తులు మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల ఆరోగ్యానికి కలిగే హానిని తెలుసుకున్న తర్వాత, ఏ వయస్సులో ఉన్న వ్యక్తి ఎన్ని గంటలు నిద్రపోవాలో ఇప్పుడు తెలుసుకుందా.. నేషనల్ స్లీప్ ఫౌండేషన్ తన అధ్యయనంలో ఎవరూ ఎన్ని గంటలు నిద్రపోవాలనే వివరాలు ఇలా ఉన్నాయి.

- 0-3 నెలలు: నిద్ర సమయం 14 నుంచి 17 గంటలు ఉండాలి.
- 4-11 నెలలు: 12 -15 గంటలు నిద్రించాలి.
- 14-17 సంవత్సరాలు: 8 -10 గంటలు. 7 గంటల కంటే తక్కువ,11 గంటలకు మించకూడదు.
- 18- 25 సంవత్సరాలు: 7 -9 గంటలు. 6 గంటల కంటే తక్కువ,11 గంటలకు మించకూడదు.
- 26- 64 సంవత్సరాలు: 7 నుంచి 9 గంటలు.
- 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ: 7 నుంచి 8 గంటలు.

కానీ కొంతమందికి వారి బిజీ లైఫ్‌స్టైల్ లేదా అలవాట్ల వల్ల తగినంత నిద్ర లేనప్పుడు.. వారికి కార్డియోవాస్క్యులర్ డిసీజ్, హై బ్లడ్ ప్రెజర్, డయాబెటిస్, ఒబేసిటీ, డిప్రెషన్, హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.





# అక్షయ తృతీయ ధన్ ధనా ధన్..

**రూ. 20,000 కోట్ల వ్యాపారం!**

**గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన పసిడి, వెండి ధరలు**

**భారీ నగలకు బదులు తక్కువ బరువున్న ఆభరణాలకే ప్రాధాన్యం**

**విలువ పరంగా అమ్మకాలు పెరిగినా పరిమాణంలో తగ్గుదల**

**డిజిటల్ గోల్డ్, గోల్డ్ బాండ్ల వైపు పెరుగుతున్న ఆసక్తి**



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నా అక్షయ తృతీయ నాడు పసిడి కొనుగోలు చేయాలనే సెంటిమెంట్ ఏమాత్రం తగ్గలేదు. ఈ ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా దేశవ్యాప్తంగా బంగారం, వెండి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పర్వదినాన సుమారు రూ. 20,000 కోట్ల విలువైన వ్యాపారం జరుగుతుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది. గతేడాది ఇదే రోజున జరిగిన రూ. 16,000 కోట్ల వ్యాపారంతో పోలిస్తే ఇది 25 శాతం అధికం కావడం గమనార్హం.

గతేడాది 10 గ్రాముల బంగారం ధర సుమారు లక్ష రూపాయలు ఉండగా, ప్రస్తుతం అది రూ. 1.58 లక్షలకు చేరింది. వెండి ధర కూడా కిలోకు రూ. 85,000 నుంచి ఏకంగా రూ. 2.55 లక్షలకు ఎగబాకింది. ఈ భారీ ధరల పెరుగుదల వినియోగదారుల కొనుగోలు సరళిపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. ప్రజలు భారీ ఆభరణాలకు బదులుగా తక్కువ బరువున్న (లైట్‌వెయిట్), నిత్యం ధరించేందుకు వీలైన నగల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ధరలు పెరగడంతో వ్యాపారం విలువ పరంగా పెరిగినట్లు కనిపిస్తున్నా, విక్రయించిన బంగారం పరిమాణం (వాల్యూమ్) తగ్గిందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి దేశవ్యాప్తంగా సుమారు 10 టన్నుల బంగారం, 157 టన్నుల వెండి అమ్ముడవుతాయని అంచనా. మరోవైపు, భౌతిక బంగారానికి బదులుగా డిజిటల్ గోల్డ్, సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు కూడా ప్రజలు, ముఖ్యంగా యువత ఆసక్తి కనబరుస్తున్నారు.

# బీమా తరహాలో పింఛన్ల రంగలోకి నూరు శాతం ఎఫ్‌డీఐలు!




**న్యూఢిల్లీ:** బీమా రంగం తరహాలో పింఛన్ల రంగంలోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని నూరు శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సంబంధిత బిల్లును తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీమా రంగంలోకి నూరు శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తున్న సంగతి తెలిసిందే. అంతకుముందు 74 శాతంగా ఉన్న ఎఫ్‌డీఐల పరిమితిని 100 శాతానికి పెంచుతూ గతేడాది పార్లమెంట్ చట్టం చేసింది.

### 18 శాతం రాబడి సాధ్యమేనా?

పింఛను రంగంలో ప్రస్తుతం ఉన్న 49 శాతంగా ఉన్న ఎఫ్‌డీఐల పరిమితిని నూరు శాతానికి పెంచాలంటే 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం - 2013కు సవరణలు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లునే వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లులో పీఎఫ్‌ఆర్‌డీఏ నుంచి నేషనల్ పెన్షన్ సిస్టం ట్రస్ట్‌ను వేరు చేసే సవరణను కూడా పొందుపరచనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్‌పీఎస్ ట్రస్ట్ వద్ద ఉన్న అధికారాలు, విధులన్నింటినీ ఓ ఛారిటబుల్ ట్రస్ట్ లేదా కంపెనీల చట్టం పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. పీఎఫ్‌ఆర్‌డీఏ నుంచి దీన్ని పూర్తిగా వేరు చేసి 15 మంది సభ్యులతో కూడిన ఓ బోర్డును ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# వార్ ఎఫెక్ట్: మార్చిలో 13 శాతం తగ్గిన ఎల్పీజీ వినియోగం



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వంటగ్యాస్‌పై ఆ ప్రభావం కన్పిస్తోంది. భారత్‌లో మార్చి నెలలో ఎల్పీజీ వినియోగం (శ్రీజూస్త్ర ఎశీఅంబఎజ్ఞ్ఆశీఅ) 13 శాతం మేర పడిపోయింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఎల్పీజీ వినియోగం 2.729 మిలియన్ టన్నుల నుంచి 12.8 శాతం తగ్గి 2.379 మిలియన్ టన్నులకు చేరినట్లు పెట్రోలియం ప్రణాళిక విశ్లేషణ సెల్ (పీపీఏసీ) పేర్కొంది.

ఎల్పీజీ అవసరాల్లో సింహభాగం దిగుమతులపైనే ఆధారపడటం, ప్రధాన సరఫరా మార్గంగా హర్మూజ్ జలసంధి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల ఇంధన సరఫరా గొలుసులో ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే దేశంలో డొమెస్టిక్ (గృహ అవసరాలు) సిలిండర్ల విక్రయాలు 8.1 శాతం పడిపోయాయి. నాన్ డొమెస్టిక్ (వాణిజ్య అవసరాలు) సిలిండర్ల విక్రయాలు 48 శాతం, బల్క్ ఎల్పీజీ విక్రయాలు ఏకంగా 75.5 శాతం మేర తగ్గాయి. గ్యాస్ కొరతను అధిగమించేందుకు భారత్ ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. దేశంలో ఎల్పీజీ ఉత్పత్తులను పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ క్రమంలోనే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎల్పీజీ ఉత్పత్తి 12.8 మిలియన్ టన్నుల నుంచి 13.1 మిలియన్ టన్నులకు చేరింది.

దేశంలో చమురు కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలో పెట్రోల్, డీజిల్‌కు కూడా డిమాండ్ భారీగా పెరిగింది. మార్చి నెలలో పెట్రోల్ విక్రయాలు 7.6 శాతం పెరిగి 3.78 మిలియన్ టన్నులకు, డీజిల్ వినియోగం 8.1 శాతం పెరిగి 8.727 మిలియన్ టన్నులకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఏటీఎఫ్ విక్రయాలు 2 శాతం పెరిగి 9.161 మిలియన్ టన్నులకు చేరాయి. పెట్రోల్ వినియోగం 6.5% పెరిగి 42.586 మిలియన్ టన్నులకు, డీజిల్ విక్రయాలు 3.6% పెరిగి 94.705 మిలియన్ టన్నులకు చేరింది.

# చితక్కొట్టిన ప్రియాన్ష్, కూపర్..

**లక్నోపై పంజాబ్ భారీ విజయం..!**



**ఛండీఘర్:** ఐపీఎల్ 19లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా మట్టికరిపిస్తున్న శ్రేయస్ అయ్యర్ సేన ఈసారి లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ పంచ్‌ను రుచిచూపింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నొల్లీ(87)ల విధ్వంసకాండతో 254 రన్స్ కొట్టిన పంజాబ్ ఆపై లక్నోను వణికించింది. ఆరంభం నుంచి తడబడిన లక్నో మర్క్‌రమ్(42) పోరాటంతో రన్స్‌కు పరిమితమైంది. పంజాబ్ ఖాతాలో ఐదో విజయం చేరగా.. పంత్ బృందానికి నాలుగో ఓటమి ఎదురైంది.

ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్ పంజాకు లక్నో సూపర్ జెయింట్స్ విలవిలలాడింది. ఆదివారం డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ దెబ్బకు లక్నో బదులివ్వలేకపోయింది. బౌలర్ల వైఫల్యంతో భారీ స్కోర్ సమర్పించుకున్న లక్నో.. 255 పరుగుల ఛేదనలో ఏ కోశాన లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్‌గా వచ్చిన ఆయుశ్ బదొని(35) ఔట్ చేసి లక్నోను



ఒత్తిడిలో పడేశాడు.

విధ్వంసక హిట్టర్లైన మిచెల్ మార్ష్(40), రిషభ్ పంత్(43)లు రాణించినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. హిట్టర్ పూరన్(9) విఫలమవ్వగా.. ఎడెన్ మర్క్‌రమ్(42), ముకుల్ చౌదరీ(21 నాటౌట్)లు పోరాడారు. కానీ, రన్‌రేటు అంతకంతకూ పెరిగిపోవడంతో వీరేమీ చేయలేకపోయాడు. లక్నో రెండొందలకే పరిమితవ్వగా పంజాబ్ 54 పరుగుల తేడాతో గెలుపొంది అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది.

### దంచికొట్టిన కుర్రాళ్లు..

ఐపీఎల్‌లో రికార్డుల మోతకు తెరదీసింది పంజాబ్ కింగ్స్. టోర్నీలో అజేయంగా దూసుకెళ్తున్న ఆ జట్టు ముల్లన్‌పూర్‌లో భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జెయింట్స్‌ను భయపెట్టింది. టాస్ ఓడినా పంజాబ్‌కు శుభారంభం దక్కకున్నా.. కుర్రాళ్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(0)ను తొలి ఓవర్లోనే ఔటైనా.. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు ప్రియాన్ష్ ఆర్య(93) చుక్కలు చూపించాడు. కూపర్ కొన్నొల్లీ(87) తో కలిసి విధ్వంసకాండ రచించిన ఈ కుర్రాడు మెరుపు అర్ధ శతకంతో రెచ్చిపోయాడు.

బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకి లేదా బౌండరీ గీత దాటించడమే లక్ష్యంగా వీరిద్దరూ చెలరేగారు. ఇద్దరూ పోటాపోటీగా బౌండరీలు బాదేయగా పంజాబ్ స్కోర్ రాకెట్ వేగంతో పరుగులు తీసింది. శతకాల దిశగా దూసుకెళ్లిన ఈ జోడీని ప్రిన్స్ యాదవ్(2-25) విడదీసి లక్నోకు ఊరటనిచ్చాడు. ఆ వెంటనే ప్రియాన్ష్‌ను సిద్దార్థ్(2-35) ఔట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(5) నిరాశపరిచాడు. అనంతరం నేహల్ వధేరా(13), మార్కస్ స్టోయినిస్(29), శశాంక్ సింగ్(17)లు స్కోర్ బోర్డును ఉరికించారు. ఆఖరి ఓవర్లో చివరి బంతికి స్టోయినిస్ రనౌటవ్వగా పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది.

# 2027 ప్రపంచకప్‌పై గురి..

**అగార్కర్‌నే కొనసాగించాలని బీసీసీఐ నిర్ణయం**

**టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపు?**

**టీ20 ప్రపంచకప్ విజయంలో అగార్కర్ పాత్రపై బోర్డు సంతృప్తి**

**కోచ్ గౌతమ్ గంభీర్‌తో సమన్వయం కూడా ఒక ప్రధాన కారణం**



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను పదవిలో కొనసాగించాలని నిర్ణయించింది. 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఆయన పదవీకాలాన్ని పొడిగించేందుకు బోర్డు సిద్ధమైనట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ పనితీరుపై బీసీసీఐ సంతృప్తిగా ఉంది. ముఖ్యంగా ఇటీవల టీ20 ప్రపంచకప్ 2024 విజయంలో, జట్టులోకి యువ ఆటగాళ్లను తీసుకురావడంలో అగార్కర్ వ్యూహాలు ఫలించాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ల తర్వాత జట్టు పునర్నిర్మాణ ప్రక్రియలో అగార్కర్ అనుభవం కీలకమని బోర్డు భావిస్తోంది.

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా జరిగే 2027 ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే బలమైన జట్టును సిద్ధం చేయాలని బీసీసీఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దీర్ఘకాలిక ప్రణాళిక విజయవంతం కావాలంటే సెలెక్షన్ కమిటీలో స్థిరత్వం అవసరమని, అందుకే అగార్కర్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చి కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో అగార్కర్‌కు మంచి సమన్వయం ఉండటం కూడా ఈ నిర్ణయానికి మరో కారణంగా కనిపిస్తోంది. వీరిద్దరి ఆలోచనా విధానం జట్టు ఎంపికలో ఏకాభిప్రాయానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. రాబోయే చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు కూడా అగార్కర్ నేతృత్వంలోనే జట్టును ఎంపిక చేయనున్నారు.

# నొప్పితో విలవిల్లాడుతున్నా బ్యాటింగా?

**సీఎస్‌కే తీరుపై అశ్విన్ ఆగ్రహం**

**సీఎస్‌కే యువ ఆటగాడు ఆయుష్ మాత్రే గాయంపై అశ్విన్ ఆగ్రహం**

**గాయపడినా బ్యాటింగ్ కొనసాగించమనడంపై తీవ్ర విమర్శలు**

**ఇది ఆటగాడి భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనన్న అశ్విన్**

**సీఎస్‌కే మెడికల్ టీమ్ తీరును తప్పుపట్టిన వెటరన్ స్పిన్నర్**

**హైదరాబాద్‌తో మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో ఓడిన సీఎస్‌కే**



**హైదరాబాద్:** ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో చోటుచేసుకున్న ఒక ఘటన తీవ్ర వివాదాస్పదమైంది. సీఎస్‌కే యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే గాయపడి నొప్పితో విలవిల్లాడుతున్నా, అతడిని బ్యాటింగ్ కొనసాగించమని కోరడంపై టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. ఇది బాధ్యతారాహిత్యమని, ఒక యువ ఆటగాడి భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని ఆయన మండిపడ్డాడు.

శనివారం నాటి మ్యాచ్‌లో సీఎస్‌కే ఛేజింగ్ సమయంలో 18 ఏళ్ల ఆయుష్ మాత్రే అద్భుతంగా ఆడుతున్నాడు. అయితే 5వ ఓవర్లో రెండో పరుగు తీసే ప్రయత్నంలో అతడి కాలికి హ్యామ్‌స్ట్రింగ్ గాయమైంది. నొప్పితో కుంటుతూ నడుస్తున్న అతడి వద్దకు ఫిజియో వచ్చినా, అతడిని 'రిటైర్డ్ హర్ట్'గా వెనక్కి పంపలేదు. దీనిపై తన యూట్యూబ్ చానెల్‌లో స్పందించిన అశ్విన్ "నేను షాక్‌కు గురయ్యాను. ఆ కుర్రాడు సరిగ్గా నడవలేకపోతున్నాడు. అలాంటి వాడిని పరుగు తీయమని అడగడం దారుణం. ఒకవేళ అది గ్రేడ్-2 గాయమైతే అతడు ఆరు వారాలు ఆటకు దూరమవుతాడు. ఒక యువకుడి కెరీర్‌తో ఇలా ఆడుకుంటారా?" అని ప్రశ్నించాడు.

గతంలో దీపక్ చాహర్ వంటి ఆటగాళ్లు సీఎస్‌కేలో తరచూ గాయపడటాన్ని అశ్విన్ గుర్తుచేశాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను ఏడాది పొడవునా పర్యవేక్షించడంలో చెన్నై జట్టు విఫలమవుతోందని విమర్శించాడు. ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే 10 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. గాయపడిన తర్వాతి బంతికే భారీ షాట్‌కు యత్నించిన మాత్రే 30 పరుగుల వద్ద ఔటయ్యాడు.

# ఈ సీజన్ లో ఎట్టకేలకు గెలుపు బోణీ కొట్టిన కేకేఆర్...

**రాజస్థాన్‌పై థ్రిల్లింగ్ విక్టరీ**

**రాజస్థాన్ రాయల్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్**

**అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించిన ఫినిషర్ రింకూ సింగ్**

**156 పరుగుల లక్ష్య ఛేదనలో 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన కేకేఆర్**

**కేకేఆర్ బౌలర్ల ధాటికి 155 పరుగులకే పరిమితమైన రాజస్థాన్**

**వరుణ్ చక్రవర్తి, కార్తీక్ త్యాగి చెరో మూడు వికెట్లతో విజృంభణ**



**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) అద్భుత విజయాన్ని అందుకుంది. టాపార్డర్ కుప్పకూలిన క్లిష్ట పరిస్థితుల్లో ఫినిషర్ రింకూ సింగ్ (53బి) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, రాజస్థాన్ రాయల్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో, ఎట్టకేలకు ఈ సీజన్ లో కేకేఆర్ తొలి విజయం అందుకుంది. టోర్నీలో ఇప్పటిదాకా 7 మ్యాచ్ లు ఆడిన కోల్ కతా జట్టు 5 మ్యాచ్ ల్లో ఓడి, ఒకదాంట్లో నెగ్గింది. ఒక మ్యాచ్ రద్దయింది.

నేటి మ్యాచ్ లో 156 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ (0), కెప్టెన్ అజింక్యా రహానే (0) డకౌట్ అయ్యారు. దీంతో 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కామెరూన్ గ్రీన్ (27) వేగంగా ఆడినా, ఆ తర్వాత వరుసగా వికెట్లు పడటంతో కేకేఆర్ 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్‌కు అనుకుల్ రాయ్ (29బి) అండగా నిలిచాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు అజేయంగా 76 పరుగులు జోడించి మరో రెండు బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా 2 వికెట్లు పడగొట్టాడు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్, కేకేఆర్ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (39), వైభవ్ సూర్యవంశీ (46) శుభారంభం అందించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 4 ఓవర్లలో కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, కార్తీక్ త్యాగి కూడా 3 వికెట్లతో రాణించాడు. సునీల్ నరైన్ రెండు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించాడు.


MOVIE TIME



# తెలుగు టు హిందీ... చేతి నిండా ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!

టాకీస్: తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన 'లుక్కే' అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి 'ఫర్జీ' సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో 'తలాఖో మే ఏక్', ఆర్. మాధవన్‌తో 'బ్రిడ్జ్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కూడా రాశీ చేతిలో ఉన్నాయి.

# కొత్త జానర్ ట్రై చేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్...




టాకీస్: టాలీవుడ్‌లో భారీ బడ్జెట్, కమర్షియల్ చిత్రాలకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పుడు కొత్త జానర్‌లోకి అడుగుపెట్టింది. తొలిసారిగా ఓ పక్కా హారర్ సినిమాను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పకుడిగా వ్యవరించడం విశేషం. '418' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రక్తం మరకలతో ఉన్న ఒక పాత తలుపుపై '418' అనే నంబర్ కనిపిస్తోంది. ఇది సినిమా కథాంశంపై ఉత్కంఠను రేకెత్తిస్తోంది. "హారర్ సినిమాల్లో నవ్వింది చాలు.. ఇక భయపడాల్సిన సమయం వచ్చింది" అనే ట్యాగ్‌లైన్‌ను పోస్టర్‌పై జతచేశారు. ఇటీవల కాలంలో హ... కామెడీలు ఎక్కువైన నేపథ్యంలో, ప్రేక్షకులకు అసలైన భయాన్ని పరిచయం చేసేందుకే ఈ సినిమాను తీస్తున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ వంటి స్టార్ డైరెక్టర్ ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో సినిమా పై అంచనాలు భారీగా పెరిగాయి. ఆయన సినిమాల్లో ఉండే డార్క్ థీమ్, ఇంటెన్స్ మూడ్ ఈ హారర్ చిత్రానికి అదనపు బలం అవుతుందని భావిస్తు న్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.


# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తమన్నా..




టాకీస్: ప్రముఖ సినీ నటి తమన్నా భాటియా ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంది. సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి చేరుకున్న ఆమె, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తన తిరుమల పర్యటనకు సంబంధించిన ఫోటోలను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, తమన్నా తదుపరి చిత్రం 'వ్వాన్'లో నటించబోతున్నారు. ఏక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రలో కనిపిస్తుండగా, దీపక్ మిశ్రా మరియు అరుణాభ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం రక్షా బంధన్ కానుకగా ఈ ఏడాది ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది.

# ఆధ్యాత్మిక కలయిక..

'వాల్మీకి రామాయణం' కోసం జతకట్టిన ఇళయరాజా!



**టాకీస్:** భారతీయ సంగీత శిఖరం, మాస్ట్రో ఇళయరాజా మరో అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. బాలీవుడ్ నుంచి ప్రతిష్టాత్మక 'వాల్మీకి రామాయణం' రాబోతుండగా ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, ఇదొక ఆధ్యాత్మిక కలయిక.. సంగీతం ఇప్పుడు ఒక నైవేద్యం అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. భావనా తల్వార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం, వాల్మీకి మహర్షి రచించిన అసలు సిసలు రామాయణ ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించనుంది. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రానికి ఇళయరాజా తన సంగీతంతో ప్రాణం పోయనున్నారు. విజువల్స్ మరియు సంగీతం పరంగా అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# 'వాలీ' మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన క్రిష్!

**టాకీస్:** ప్రముఖ దర్శకుడు క్రిష్ జగర్లమూడి చేతుల మీదుగా విడుదలైన 'వాలీ' చిత్ర మోషన్ పోస్టర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్ తెరపై వాలీబాల్ క్రీడ నేపథ్యంలో వస్తున్న మొట్టమొదటి స్పోర్ట్స్ డ్రామాగా గుర్తింపు పొందిన ఈ చిత్రం, టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఫైర్‌వాటర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై జి. రోహన్ రెడ్డి నిర్మాణంలో, దిలీప్ కె. మనుకొండ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను క్రిష్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.